సాక్షి సూర్యాపేట

శనివారం । 4 । మార్చి । 2023



గణితం కీలకం

మానవాళి మనుగడకు గణితశాస్త్రం కీలకమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో



బీఆర్‌ఎస్ హయాంలోనే..

బీఆర్‌ఎస్ హయాంలోనే ముదిరాజ్‌లకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 37°/18°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



మాట్లాడుతున్న డీఐఈఓ జానపాటి కృష్ణయ్య

హుజూర్‌నగర్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని చదువుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జానపాటి కృష్ణయ్య అన్నారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఐఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యం దిశగా చదువుకుని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీడీఎస్ ప్రసాద్, అధ్యాపకులు అరుణ, బ్రహ్మాచారి, నరసింహారావు, నాగరాజు, హేమచంద్రారెడ్డి, సత్యం, మహేష్, రామమూర్తి, వీరన్న, నాగులు మీరా, ఉపేంద్ర, రాము, రాములు, తిరుమలరావు, సృజన్ కుమార్, నాగమణి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో రూ.5లక్షల ఆరోగ్య బీమా



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌తో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 43వ వార్డులో మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మీర్ అక్బర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ ఆయుష్మాన్ భారత్‌ను 2018 లో ప్రారంభించినప్పటికీ, సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రులకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి రావడంతో ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అబీద్, చలమల్ల నర్సింహా, పల్స మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సోమనర్సయ్య



తిరుమలగిరి, సూర్యాపేట : సూర్యాపేట జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుమలగిరి పట్టణానికి చెందిన ఇమ్మడి సోమనర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన తిరుమలగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, తిరుమలగిరి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సోమనర్సయ్య మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంప నాగేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మిల్లర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకన్న



వెంకన్నను సన్మానిస్తున్న ఉద్యోగులు

భానుపురి (సూర్యాపేట) : అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన మేక వెంకన్న నియామకమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన ఎల్ఐసీ సహ ఉద్యోగులు, ఏజెంట్లు శుక్రవారం స్థానికంగా ఆయనను ఘనంగా సన్మానించారు. వెంకన్న మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు ఎవరు గురైనా న్యాయం చేసేందుకు పోరాడుతానన్నారు. తన నియమకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు షేక్ గౌస్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట ఎల్ఐసీ కార్యాలయ బ్రాంచ్ మేనేజర్ సత్యానంద్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, అభివృద్ధి అధికారులు, ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

● గ్యాస్ ధర పెంపుపై నిరసన



వంట గ్యాస్ ధరలను తగ్గించాలని హుజూర్‌నగర్‌లో రోడ్డుపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తదితరులు



కోదాడలో గ్యాస్ సిలిండర్‌తో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య



తిరుమలగిరిలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తదితరులు

అద్దె వాహనాలకు దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేట : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి రోజు రక్త నమూనాలు సేకరించేందుకు నాలుగు అద్దె వాహనాల కోసం ప్రైవేట్ వాహనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఎంహెచ్ఓ కోటాచలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల యాజమానులు తమ వాహనాలు, సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అద్దె రుసుము నెలకు రూ. 33వేల చొప్పున ఒక సంవత్సరం ఒప్పందం ప్రకారం చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వాహన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌ఎల్‌ఎంతో ఉపాధి

- కోళ్లు, గొర్రెలు, పందుల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకం తీసుకువచ్చిన కేంద్రం
- యూనిట్ విలువలో 50శాతం సబ్సిడీ
- రైతులు, నిరుద్యోగులు, సహకార సంఘాలకు ఆదాయ మార్గం
- అన్ని కులాల వారికి వర్తింపు

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం రైతులు, నిరుద్యోగులు, సహకార సంఘాలకు ఉపాధి మార్గం చూపడమే కాకుండా మాంసం, గుడ్ల ఉత్పత్తులను పెంచడానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పశువుల దాణా తయారీ, కోళ్లు, గొర్రెలు, పందుల పెంపకాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేయూతనందిస్తుంది. వీటిలో ఒక్కో యూనిట్ విలువ రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉండగా అందులో 50శాతం సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుంది. పశు సంవర్ధకశాఖ ద్వారా అమలు చేస్తున్న ఈ పథకానికి గొల్లకురుమలే కాకుండా అన్ని సామాజిక వర్గాల వారూ అర్హులే. నిరుద్యోగులతో పాటు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.



సబ్సిడీ ఇలా..

కోళ్ల పెంపకం విలువ రూ.25లక్షలు కాగా అందులో ప్రభుత్వం రూ.12.5లక్షల సబ్సిడీ అందిస్తుంది. మిగిలిన రూ.12.5లక్షలను లబ్ధిదారులు స్వయంగా గాని బ్యాంకు రుణంగా కాని సమకూర్చుకోవాలి. ఇక 100 గొర్రెలు, 5 పొట్టేళ్ల యూనిట్ విలువ రూ.20లక్షలు ఉండగా అందులో రూ.10లక్షలు సబ్సిడీ కాగా మిగిలిన రూ.10లక్షలను లోనుద్వారా కానీ స్వయంగా పెట్టుబడిగా సమకూర్చుకోవాలి. ఈ విధంగా 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల యూనిట్ విలువ రూ.కోటి వరకు ఉండగా రూ.50లక్షల సబ్సిడీ ఇస్తుండగా.. మిగిలిన రూ.50 లక్షలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. పందుల పెంపకానికి 50 ఆడ, 5 మగపందుల యూనిట్‌కు రూ.30లక్షలు కాగా రూ.15లక్షల సబ్సిడీ వస్తుంది. 100 పందులకు రూ.60లక్షలు కాగా రూ.30లక్షల సబ్సిడీ వస్తుంది. అయితే తీసుకున్న యూనిట్‌లో సబ్సిడీని ప్రారంభంలో 50శాతం, మిగిలిన సబ్సిడీని రెండేళ్ల తర్వాత బ్యాంకులో జమ చేస్తారు.

ఎంపిక విధానం

దరఖాస్తు దారులకు యూనిట్‌ను బట్టి రెండు నుంచి 10 ఎకరాల వరకు సొంత భూమి కానీ లీజుకు తీసుకున్న భూమి అయినా ఉండాలి. రాష్ట్ర స్థాయిలో యానిమల్ హజ్బెండరీ డైరెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలి



జీవాలతో పాటు, కోళ్లు, పందుల పెంపకంపై ఆసక్తి కలిగిన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ యూనిట్‌కైనా ప్రభుత్వం అందజేస్తున్న 50 శాతం సబ్సిడీ పోను మిగిలిన 50శాతం బ్యాంకులో గ్యారంటీ లేదా రుణం అనమతి పొందవచ్చు. నిరుద్యోగులకు ఇది మంచి అవకాశం.

– నాగేంద్రబాబు, మండల పశువైద్యాధికారి, కోదాడ

5న హుజూర్‌నగర్ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 10 : 30 గంటల నుంచి 11 : 30 గంటల వరకు

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో ఆదివారం 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

ఫోన్ చేయాల్సిన నంబర్ : 94408 17222



యాకుబ్ పాషా, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్

గ్యాస్ లీకేజీలపై అవగాహన అభినందనీయం

- ఎస్పీ రాజేంద్రప్రసాద్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

సూర్యాపేటరూరల్ : హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో పెట్రోలియం, గ్యాస్ లీకేజీలపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సూర్యాపేట మండలం కేసారం సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోలియం, పైపులైన్, పిక్ గ్యాస్ పైపులైన్ సిబ్బంది గ్యాస్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా హెచ్‌పీసీఎల్ ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ పెట్రోలియం పైపులైన్లు, పిక్ గ్యాస్ పైపులైన్ ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని సూచించారు. పైపులైన్ లీకేజీ అయినట్లు దృష్టికి వస్తే పైపులైన్‌ల సంస్థ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ నాగభూషణం, హెచ్‌పీసీఎల్ డీజీఎం గంగవరపు అంకయ్య, మేనేజర్ అంకుర్ మాలిక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మిషన్ భగీరథ ద్వారా నిరంతర నీటి సరఫరాకు మెరుగైన చర్యలు తీసుకోవాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ వెంకట్రావు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఏఈ, డీఈలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది ప్రతివారం ప్రత్యేక సమావేశాలు ఏర్పరచుకొని తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం, గురువారం ఉదయం మిషన్ భగీరథ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, రోడ్లు భవనాల శాఖ, విద్యుత్ శాఖ ఇంజనీర్లు సమావేశం ఏర్పరచుకొని తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్చించాలని తెలిపారు. మిషన్ భగీరథపై ఈఈ లు వెబెక్స్ ద్వారా ప్రతి సోమవారం గురువారం ఏఈ, డీఈలతో రివ్యూ చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం డీఆర్‌డీఓ, డీపీఓ, సీఈఓలు గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేయాలని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో మిషన్ భగీరథ ఇంట్రా విభాగంలో 214 సమస్యలు, గ్రిడ్ విభాగంలో 178 సమస్యలను గుర్తించడం జరిగిందని, వాటిలో 60 సమస్యలను ఇంజనీరింగ్ అధికారులు పరిష్కరించినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని 15 రోజుల్లోగా సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

డీఈ, ఏఈలకు కలెక్టర్ అభినందన

తుంగతుర్తి పరిధిలోని మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా బాగా జరుగుతున్నదని డీఈను, అదేవిధంగా ఆత్మకూర్, మోతె, పెన్‌పహాడ్, ఏఈలను కలెక్టర్ అభినందించారు. అనంతరం ఈ- ఆఫీస్ ఫైల్ ప్రాసెసింగ్‌పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, మోహన్‌రావు, మిషన్ భగీరథ ఎస్సీ సురేష్, ఈఈలు పాపారావు, రామారావు, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, ఆర్డీఓలు, జిల్లా స్పెషల్ ఆఫీసర్లు డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ పూర్తయ్యేదెప్పుడో..



నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్

- ఐదేళ్లు దాటినా సాగుతున్న నిర్మాణం
- ఇప్పటివరకు 80 శాతం పనులే పూర్తి
- మే 31 వరకు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశం



ఫినిషింగ్ పనులు చేస్తున్న కూలీలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కొత్తగా ఏర్పడిన పలు జిల్లాల్లో నూతన కలెక్టరేట్ భవనాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని యాదాద్రి కలెక్టరేట్ కూడా ప్రారంభమైంది. కానీ సూర్యాపేటలో మాత్రం పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కలెక్టరేట్ నిర్మాణ విషయంలో కలెక్టర్ వెంకట్రావ్ సీరియస్‌గా తీసుకున్నారు. మే 31 నాటికి పనులు పూర్తి చేయించాలని ఆర్అండ్‌బీ అధికారులను శుక్రవారం ఆదేశించారు.

2017లో శంకుస్థాపన..

2017 అక్టోబర్ 12న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా చివ్వెంల మండలం కుడకుడ గ్రామ సమీపంలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్వే నంబర్ 320, 321లలో 21 ఎకరాల ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేశారు. అయితే కొందరు ఈ భూములపై కోర్టును ఆశ్రయించగా దాదాపు 8 నెలల తరువాత 2018 జూన్‌లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.40.90 కోట్లు మంజూరు చేసింది. 5 సంవత్సరాలు పూర్తయినా నిర్మాణ పనులు 80 శాతం మాత్రమే జరిగాయి.

సంవత్సరంలోపు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా..

కలెక్టరేట్ నిర్మాణ పనులు ప్రారంభమైన సంవత్సరంలోగా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ 2019లోగా పనులు పూర్తి కావాల్సి ఉండగా కాలేదు. ఆ తరువాత కరోనాతో నిర్మాణ పనులు మందకొండిగా సాగాయి. 2021 దసరా, 2022 ఉగాది, ఆ తర్వాత దసరాకు కలెక్టరేట్ ప్రారంభమవుతుందని ప్రచారం జరిగింది. కానీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రారంభించలేదు. ఇక మే 31 నాటికి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికైనా నిర్మాణ పనులు పూర్తి చేస్తారా..? అనే అనుమానం ప్రజల్లో నెలకొంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఫినిషింగ్ పనులు, ఆవరణలో సీసీ రహదారుల పనులు, కలెక్టర్, అదనపు కలెక్టర్ నివాస గృహాల పనులు చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కుక్కలు, కోతులను వేరేచోటుకు తరలించాలి

- సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి
- 'సాక్షి ఫోన్‌ఇన్'లో సమస్యలు విన్నవించిన తిరుమలగిరి పట్టణవాసులు
- పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సాక్షి ఫోన్‌ఇన్



ఫోన్‌లో పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో కుక్కలు, కోతులు, పందుల బెడదను నివారించాలని పట్టణవాసులు వేడుకున్నారు. తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్‌తో శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని, డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈమేరకు ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

ప్రశ్న : పట్టణ కేంద్రంలో పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. వీటిని నియంత్రించాలి.

– కడెం లింగయ్య, మోహన్, లింగయ్య, 11వ వార్డు

కమిషనర్ : పందుల యజమానులతో మాట్లాడాం. వారికి నోటీసులు ఇచ్చాం. 5కి.మీ. దూరంలో పందులు వదలాలని సూచించాం.

ప్రశ్న : తిరుమలహిల్స్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు.

– కె.అశోక్‌రెడ్డి, 7వ వార్డు

కమిషనర్ : కాంట్రాక్టర్‌తో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం.

ప్రశ్న : తాటిపాములకు వెళ్లే దారిలో డ్రెయినేజీ కాల్వ స్లాబు పగిలిపోయింది.

– తరుణ్, 11వ వార్డు

కమిషనర్ : పగిలిపోయిన స్లాబుకు ఏఈతో ఎస్టిమేషన్ వేయించి త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

ప్రశ్న : 5, 7వ వార్డుల్లో ఇంటి యజమానులు రోడ్డు మీదకే నిర్మాణాలు చేపడుతున్నారు.

– ఎస్.కొండల్‌రెడ్డి, 7వ వార్డు, నాగేంద్రచారి 5వ వార్డు

కమిషనర్ : రోడ్ల మీదకు నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే వాటిని తొలగింపజేస్తాం.

ప్రశ్న : మున్సిపాలిటీకి నూతన భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తి కాలేదు.

– కళ్యాణ్, శ్రీనివాస్, తిరుమలగిరి

కమిషనర్ : ఇంటిగ్రేటెడ్, మున్సిపాలిటీ భవన నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

ప్రశ్న : అనంతారం నుంచి ప్రతిరోజు రాత్రి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

– రాజు, అనంతారం

కమిషనర్ : ఇసుక ట్రాక్టర్ల నియంత్రణకు రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ప్రశ్న : అనంతారం మోడల్ స్కూల్ సమీపంలో వీధి లైట్లు వెలగడం లేదు.

– శ్రీనివాస్, అనంతారం

కమిషనర్ : మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి వీధి లైట్లు వెలిగేలా చూస్తా.

ప్రశ్న : చెత్త సేకరణకు ఆటోలు రావడం లేదు.

– నీలిమ, 5వ వార్డు

కమిషనర్ : అన్ని కాలనీలకు చెత్త సేకరణకు ఆటోలు తప్పనిసరిగా పంపిస్తాం. ఎక్కడైనా సమస్య ఉంటే పరిష్కరిస్తాం.

ప్రశ్న : పద్మశాలీ కాలనీలో దోమల బెడద ఉంది.

– టి.యాదగిరి, భిక్షమమ్మ, పద్మశాలీ కాలనీ

కమిషనర్ : అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తాం. డ్రెయినేజీలు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : 11వ వార్డులో నీటి సమస్య అధికంగా ఉంది.

– వీరేష్, 11వ వార్డు

కమిషనర్ : సిబ్బందిని పంపించి తాగు నీటి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : 15వ వార్డులోని మోత్కూరు రోడ్డులో మురుగు నీరు నిలుస్తోంది.

– సురుగురు శ్రీనివాస్, 15వ వార్డు

కమిషనర్ : త్వరలోనే తొర్రూరు-వలిగొండ హైవే రోడ్డు పనులు ప్రారంభమవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా అండర్ డ్రెయినేజీ వస్తుంది.

ప్రశ్న : తిరుమలగిరి పట్టణంలో ప్రధాన రహదారిపై వీధి లైట్లు పూర్తిగా వెలగడం లేదు.

– యాదగిరి, తిరుమలగిరి.

కమిషనర్ : అన్ని వీధి లైట్లు వెలిగేలా చూస్తాం.

ప్రశ్న : మున్సిపాలిటీ పరిధిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి.

– సురేష్‌రెడ్డి, తిరుమలగిరి

కమిషనర్ : క్రీడా ప్రాంగణాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

ప్రశ్న : నందపురం వెళ్లే దారిలో ఉన్న చేతి పంపు చెడిపోయింది.

– కొండ సోమయ్య, కమిషనర్

కమిషనర్: సిబ్బందికి ఫోన్ చేసి హ్యాండ్‌పంప్ బాగు చేయిస్తా.

ప్రశ్న : తెలంగాణ చౌరస్తాలో రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు.

– వెంకట్‌రెడ్డి, డ్రైవర్

కమిషనర్: రోడ్లపై పార్కింగ్ చేయకుండా పోలీసుల దృష్టికి తీసుకెళ్తా.

ప్రశ్న : సీసీ రోడ్లు, డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– ఉపేందర్, 10వ వార్డు, వీరేష్, 11వ వార్డు

కమిషనర్ : అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో రూ.3 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న : కుక్కల బెడద అధికమైంది. పిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తోంది. కుక్కలు, కోతులు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి.

– రమేష్, నెల్లిబండ తండా, అశోక్, లింగయ్య, ఉపేందర్, రమేష్, మోహన్, అశోక్

కమిషనర్ : కుక్కల బెడద నివారణ చర్యలు చేపడుతున్నాం. వారం రోజుల్లో వీటి నివారణకు ప్రణాళికలు రూపొందించాం. కోతుల సమస్యను అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

క్లుప్తంగా

యాదాద్రిలో ఎన్నికల కమిషనర్ పూజలు



ఆలయ సన్నిధిలో ఎన్నికల కమిషనర్ పార్థసారథి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి, కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకువేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

తూర్పు రాజగోపురం ఎదుట షెడ్డు ఏర్పాటు



తూర్పు రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన షెడ్డు

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపైన తూర్పు రాజగోపురం ముందు మండుటెండకు భక్తులు, ఆలయ సిబ్బంది ఇబ్బందులు పడవద్దని షెడ్డును ఏర్పాటు చేశారు. గతేడాది మార్చి 20న తూర్పు రాజగోపురం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అవి వర్షానికి దెబ్బతినడంతో ప్రధానాలయం ముందే కాకుండా శివాలయానికి వెళ్తున్న మెట్ల మార్గంలో షెడ్డును బిగిస్తున్నారు.

పుస్తెలతాడు చోరీ

బీబీనగర్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును దుండగులు చోరీ చేశారు. బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామానికి చెందిన దూడల యాదమ్మ ఈనెల 2న కొండమడుగులోని తన సోదరి దూసరి అంజమ్మ ఇంటికి వచ్చింది. శుక్రవారం గ్రామంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు సోదరితో కలిసి యాదమ్మ వచ్చింది. అనంతరం ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో దుండగులు వెనుక నుంచి బైక్‌పై వచ్చి యాదమ్మ మెడలో 4తులాల పుస్తెలతాడును అపహరించుకుపోయారు. బాధితురాలి మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



108 కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు



శతఘటాభిషేకానికి పూజలు చేస్తున్న ఆచార్యులు

- అష్టోత్తర శతఘటాభిషేకం.. రాత్రి శృంగార డోలోత్సవం
- యాదాద్రిలో 11 రోజుల ఉత్సవాలకు వైభవంగా ముగింపు పలికిన ఆచార్యులు

యాదగిరిగుట్ట: పంచనారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. 11 రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు స్వామి అమ్మవార్లకు శృంగార మహోత్సవాన్ని నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు. ఉదయం ఆలయంలో వైభవోపేతంగా శతఘటాభిషేకం పూజ జరిపించారు. ఈ విశేష వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఏసీపీ సైదులు, ఆలయాధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

108 కలశాలతో...

గత నెల 21వ తేదీన స్వస్తివాచనంతో యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం ప్రధానాలయ ముఖ మండపంలో 108 బంగారు, వెండి కలశాలను పూజించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చకులు, యాజ్ఞాచార్యులు, పారాయణికులు పాంచరాత్ర ఆగమశాస్త్ర రీత్యా ఈ వేడుకను జరిపించారు. ప్రధాన కలశంతో పాటు 108 కలశాలను తొమ్మిది వరుసలుగా పేర్చి, ఒక్కో వరుసలో 12 కలశాలను పెట్టి పూజించారు. అంతకు ముందు ముఖ మండపంలో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేపట్టారు. శ్రీస్వామి అమ్మవార్లకు పంచామృతాలు, ఏలాలవంగాది చూర్ణ జలములతో, మంత్ర పూర్వక జపములతో అభిషేకించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న యజ్ఞచార్యులు, పారాయణికులు, అధికారులకు, సిబ్బందికి సన్మానం చేసి ఉత్సవ సమాప్తి సూచకంగా మంగళ నీరాజనములు అర్చక స్వాములచే నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయంలో రాత్రి

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు నిత్యారాధనలు అనంతరం రాత్రి 9.30 గంటలకు స్వామి వారి శృంగార డోలోత్సవం జరిపించారు. కల్యాణ దంపతులైన స్వామి అమ్మవార్లను ఊయలలో వేంచేపు చేసి లాలి పాటలతో, భక్తి గీతములతో సంకీర్తన గావించారు. ఊయలలో పవళించిన స్వామి వారిని దర్శిస్తే సర్వ విధ దోషములు తొలగి భక్తుల మనోరథములు నెరవేరగలవని ఈ శృంగార డోలోత్సవ వేడుక నిర్వహించినట్లు ఆచార్యులు వెల్లడించారు. శాంతి, సుఖ, సౌఖ్యములు కలుగునని ఆగమశాస్త్రాలు పేర్కొనుచున్నవి.



స్వామివారి అభిషేకానికి సిద్ధం చేసిన కళాశాలు

ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం రాత్రి వైభవోపేతంగా ముగిశాయి. రాత్రి 9గంటల నుంచి లక్షణాదేవి బృందం స్వామివారి శృంగార డోలోత్సవంలో భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్యులు శృంగార డోలోత్సవం నిర్వహిస్తున్న సమయాన సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, సినీ నటుడు జగన్, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కర్‌లు శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా వీరికి స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



ప్రధాన కలశాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు, అనువంశిక ధర్మకర్త, ఈఓ

ట్యాంకర్‌తో వరిపంటకు నీరు



తన పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు శంకర్

మునుగోడు : ఎండల తీవ్రతకు అప్పుడే అక్కడక్కడ భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. మొన్నటి వరకు పుష్కలంగా నీరుపోసిన వ్యవసాయ బోర్లు ఒక్కసారిగా తగ్గిపోవడంతో రైతులు వరి పంటను కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. ఒకపక్క విద్యుత్ కోతలు, మరోపక్క భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళనచెందుతున్నారు. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన రైతు కట్టికుంట్ల శంకర్ మూడు ఎకరాల్లో వరి సాగుచేశాడు. ఆ పంటకు రెండు బోర్ల నుంచి నీరు పెడుతున్నాడు. అయితే, తాను పంట సాగు చేసిన నెల రోజులకే బోర్లలో నీరు తగ్గుతూ వస్తుండటంతో ఇటీవల రూ.లక్షా 20వేలు ఖర్చు చేసి ఐదు బోర్లు వేశాడు. కానీ, ఏ ఒక బోరులోనూ చుక్క నీరు రాలేదు. దానికి ఉన్న రెండు బోర్లలో ఒకటి పూర్తిగా ఎండిపోయింది. దీంతో మూడు ఎకరాల్లో ఎకరంన్నర పొలానికి నీరు లేకుండా పోయింది. మరో నెల రోజులల్లో చేతికి వచ్చే పొలం ఎండిపోతే తనకు నయాపైసా రాదని, దానిని ఎలాగైనా కాపాడుకోవాలని శంకర్.. నెలకు రూ.15వేల చొప్పున ఓ వాటర్ ట్యాంకర్ అద్దెకు తీసుకున్నాడు. అందులో రోజుకు రూ.500 డీజిల్‌కు ఖర్చు చేస్తూ ట్యాంకర్‌లో నీరు నింపాకొని తీసుకొచ్చి తన పొలానికి పెడుతున్నాడు. ఇలాంటి పరిస్థితి మరికొంత మంది రైతులు కూడా ఎదుర్కొంటున్నారు.

ఆలయ అధికారులపై భక్తుల ఆగ్రహం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లకు శతఘటాభిషేకం పూజను ఆచార్యులు నిర్వహించారు. ఈ సమయంలో భక్తులకు దర్శనాలను బంద్ చేశారు. అప్పటికే ఉదయం 9 నుంచి 10గంటల వరకు బ్రేక్ దర్శనాల కొనసాగుతుండటంతో ధర్మదర్శనాలు బంద్ చేశారు. 10 గంటలకు ధర్మదర్శనాలను కొనసాగించాల్సిన అధికారులు.. శతఘటాభిషేకం ప్రారంభం కావడంతో బంద్ చేశారు. అప్పటికే గంటల తరబడి క్యూలైన్‌లో భక్తులు నిల్చున్నారు. దర్శనాలు గంటల తరబడి బంద్‌చేస్తే ఎలా అంటూ అక్కడున్న ఎస్‌పీఎఫ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం అధికారులకు భక్తులకు శ్రీస్వామి వారి దర్శనాన్ని కల్పించారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి

నేరేడుచర్ల : ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలంలో చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాణామాదవ్ కొన్ని నెలలుగా దిర్శించర్ల శివారులో ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. మాదవ్ కుమారుడు సన్మత్‌రాణా(5) బట్టీల వద్ద ఆడుకుంటుండగా డ్రైవర్ మల్లికార్జున్‌రావు ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తున్న సమయంలో బాలుడిని ఢీకొట్టాడు. గాయపడిన బాలున్ని నేరేడుచర్లలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

కోరం లేక మున్సిపల్ సమావేశం నేటికి వాయిదా



కౌన్సిల్ సమావేశంలో కూర్చున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు, కోఆప్షన్‌లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్‌తో పాటు కోఆప్షన్ సభ్యులు, అధికారులు మాత్రమే హాజరయ్యారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు 10 మంది కౌన్సిలర్లు, నలుగురు కో ఆప్షన్ సభ్యులు కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. కానీ ఇందులో వైస్ చైర్మన్ కాటంరాజుతో పాటు 10 మంది కౌన్సిలర్లు గైర్హాజరు అయ్యారు. దీంతో సరైన కోరం లేనందున్న కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి శనివారానికి వాయిదా వేశారు.

ఇటీవలనే అవిశ్వాసం..

యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిల్‌లో ఉన్న 11 మంది కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని పెట్టారు. ఇందుకు సంబంధించిన అవిశ్వాస పత్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతికి సైతం జనవరి 30న అందజేశారు. కొంత కాలంగా మున్సిపాలిటీలో చైర్ పర్సన్ వర్సెస్ కౌన్సిలర్లు అన్నట్లు కొనసాగుతుంది. ప్రతి సమావేశంలో చైర్‌పర్సన్ తనకు ఇష్టం వచ్చినట్లు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని, అందుకే తాము అవిశ్వాసం పెట్టామని అప్పట్లోనే కౌన్సిలర్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి సైతం బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, ఇండిపెండెంట్‌కు చెందిన కౌన్సిలర్లు హాజరుకాలేదని తెలుస్తుంది.

నల్లమలలో పెరిగిన వన్య ప్రాణుల సంఖ్య

చందంపేట : నల్లమల అటవీ ప్రాంతంలో గతంలో పోల్చితే వన్య ప్రాణుల సంఖ్య పెరిగిందని ఎఫ్ఆర్వో సాయి ప్రకాశ్ పేర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు, జంతువుల దాహార్తిని తీర్చేందుకు శాసర్ పిట్స్(నీటి తొట్టి)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ డ్యామ్‌లు, శాసర్ పిట్స్ ద్వారా క్రమక్రమగా నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంఖ్య పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాప్ కెమెరాల ఆధారంగా వన్య ప్రాణుల గణన జరుగుతుందన్నారు. ఇటీవల ఉమ్మడి చందంపేట మండలాన్ని ఆనుకొని ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన వన్య ప్రాణుల ఫొటోలను అటవీ శాఖ అధికారులు విడుదల చేశారు.



నల్లమల అటవీ ప్రాంతంలో తొట్టిలో నీటిని నింపుతున్న సిబ్బంది











అటవీ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన వన్య ప్రాణుల చిత్రాలు

విగ్రహాలకు నిప్పుపెట్టిన దుండగులు

ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట) : మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దేవుడి విగ్రహాలను తగులబెట్టారు. స్థానికులు భక్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఆలయంలో దీపం వెలిగించేందుకు సిద్ధంగా ఉంచిన నూనెను విగ్రహాల మీద చల్లి నిప్పంటించారని తెలిపారు. దేవాలయంలో హుండీ కన్పించడం లేదని వెండి విగ్రహాలు సైతం కాలినట్లు తెలిపారు. ఘటనపై స్థానిక భక్తులు నగిరే పర్వతాలు, తండు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మోత్కూర్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈసంఘటన మోత్కూర్ మండలంలోని సదర్శాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దొండ యాదయ్య ఇంటికి తాళం వేసి గొర్రెలు మేపడానికి ,భార్య కూలి పనులకు వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సందుక పెట్టలో ఉన్న రూ.53 వేల నగదును దోచుకెళ్లారు. బాధితుడు ఇంటికి వచ్చేసరికి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దోపిడీ దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

భువనగిరి : దోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన చుంచు బాబు గత ఫిబ్రవరి 28న రాత్రి సమయంలో భువనగిరి పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపం నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి ఆటోను అడ్డగించి చేతులతో కొట్టి, కత్తితో చంపుతానని బెదిరించి తన ఆటోతో పాటు సెల్ ఫోన్‌ను తీసుకునిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దోపిడీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తి మేడ్చల్ జిల్లా ఘటకేసర్ మండలం అన్నోజిగూడ గ్రామానికి చెందిన గణపురం నిఖిల్‌గా గుర్తించారు. ఇతడు దోపిడీలకు పాల్పడిన కేసులో జైలు జీవితం కూడా గడిపాడు. గత ఫిబ్రవరిలో జైలు నుంచి విడుదలయ్యాడు. పట్టణంలోని అర్బన్‌కాలనీలోని తన బంధువు ఇంటికి వచ్చినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.75వేలు విలువ చేసే ఆటో, రెండు సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నారు.

భర్తకు తల కొరివి పెట్టిన భార్య

యాదగిరిగుట్ట రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన భర్తకు భార్య తల కొరివి పెట్టింది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారబోయిన నర్సయ్య (59) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతనికి పిల్లలు లేకపోవడంతో, ఒక అనాథ బాలుడిని పెంచుకుంటున్నారు. అకస్మాత్తుగా మృతి చెందిన భర్తకు భార్య విజయలక్ష్మి తల కొరివి పట్టి అంత్యక్రియలను పూర్తి చేసింది. నర్సయ్య మరణం పట్ల సర్పంచ్ తోటకూరి బీరయ్య, ఆరె మల్లేష్, సోకం మల్లేష్ సంతాపం తెలిపారు.

వరిలో జీవశాస్త్ర పద్ధతుల ద్వారా సమగ్ర సస్యరక్షణ

- సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండి.జానిమియా సూచనలు

పాడి పంట

నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో వరిచేలు పొట్ట దశలో ఉన్నాయి. నిత్యం వరిలో పురుగులు, తెగుళ్లు ఆశించి పంటను నష్టపరుస్తుంటాయి. ఇలాంటి సమయంలో రైతులు రసాయన పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. అయినాగానీ కొన్ని రకాలు పురుగులు నివారణ జరగడంలేదు. ఇలాంటి సమయంలో కేవలం రసాయన మందులను ఉపయోగించకుండా జీవ శాస్త్ర పద్ధతుల ద్వారా చీడ, పీడలను నివారించవచ్చని సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండి.జానిమియా చెబుతున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..ఈ దశలో వరి చేల సమగ్ర సస్యరక్షణలో జీవ శాస్త్రపరంగా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకన్నది. ప్రకృతిలో పైర్లకు హాని చేసే పురుగులు, మేలు చేసే పురుగులు ఉన్నాయి. కొన్ని పైర్లకు హాని చేస్తాయి. ఇవి శత్రు పురుగులు. ఈ పురుగులను తినే పురుగులను మిత్ర పురుగులు అంటారు. వరి జీవావరణ వ్యవస్థలో కీడు చేసే పురుగుల కన్నా మేలు చేసే పురుగులే ఎక్కువగా ఉన్నాయి. ఈ పురుగులను మూడు రకాలుగా విభజించవచ్చు. భక్షకాలు (పరాన్న భుక్కులు), బదనికలు (పరాన్నజీవులు), వ్యాధి జనకాలు



గుడ్లను తింటున్న తూనీగ



గుడ్లను తింటున్న అక్షింతల పురుగు

- **భక్షకాలు(పరాన్న జీవులు):** హాని కలిగించే పురుగు తల్లి పురుగు, గొంగళి పురుగును గుడ్లనుకాని ఆహారంగా తీసుకుంటాయి. సాలె పురుగు ఇవి వరిని ఆశించే శత్రు పురుగులపైన ముఖ్యమైన భక్షకాలు. పిల్ల, తల్లి సాలె పురుగులు దోమ, కాండం తొలిచే పురుగు, పచ్చదోమ, ఆకుముడత పురుగులను భక్షిస్తాయి. రోజుకు 5-15 శత్రు పురుగులను తింటాయి. ఒక సాలె పురుగు క్రిమిసంహారక మందుల కన్నా ఎక్కువ లాభం చేకూర్చుతుంది.
- **తూనీగలు:** వీటి పిల్ల పురుగులు నీటిపై నుంచి వరి దుబ్బుల పైకిపోయి దోమ పిల్ల పురుగులను తింటాయి. తూనీగలు వరిపైరుపై తిరుగుతూ పచ్చ దోమలను, ఆకు ముడత పురుగు గుడ్లను తింటాయి.
- **నల్లులు:** పచ్చ నల్లులు, తల్లి పురుగులు తల నల్లగా ఉండి, పిల్ల పురుగులు పచ్చగా ఉంటాయి. ఇవి దోమ గుడ్లను దోమలును అమిత ఇష్టంగా తింటాయి. ఒక నల్లి 7-10 గుడ్లను, 2-5 దోమలును ఒక రోజులో తింటాయి.
- **అక్షింతల పురుగు:** పగలు చురుకుగా ఉండి దుబ్బుల పైభాగాన ఉండి ఆకుముడత గుడ్లను తింటాయి. వీటి పిల్ల పురుగులు చురుకుగా ఉండి రోజుకు 5-10 దోమలును తింటాయి.
- బారు మీసాల మిడత: దీని మీసాలు శరీర పొడవు కంటే రెట్టింపు ఉంటాయి. ఇవి రాత్రులందు చురుకుగా ఉండి వరినల్లి కాండం తొలిచే పురుగు గుడ్ల సముదాయాన్ని సుడి దోమలును తింటాయి.
- **బదనికలు:** (పరాన్న జీవులు): శత్రు పురుగుల మీద ఆధారపడి దాని గుడ్డు, లార్వా, కోశస్థ దశ మీద గానీ, లోపల గానీ జీవిత చరిత్రను పూర్తి చేసుకొని, వాటిని చంపి, అందులో ఉండి పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **గుడ్ల పరాన్న జీవులు:** ఇవి చిన్న కందిరీగలు. ఇవి ఆకుముడత, కాండం తొలుచు పురుగు గుడ్ల మీద గుడ్డు పెట్టి అందులో పెరిగి జీవిస్తున్న పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **లద్దె పురుగులను ఆశించే పరాన్న జీవులు:** వరి పంటను ఆశించేలార్వాలపై కందిరీగ గుడ్లు పెడుతుంది. ఈ పరాన్న జీవి పిల్ల పురుగులు పంటకి హాని చేసే లార్వాలపై ఆశించి నాశనం చేస్తాయి. ఈ కందిరీగలు 4-7 రోజులు బతుకుతాయి.
- **కోశస్థ దశను ఆశించే పరాన్న జీవులు:** బాక్టీరియా కందిరీగలో ఆకుముడత కోశస్థ దశలో ఆశించి వాటిని నాశానం చేసి, పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **వ్యాధి జనకాలు :** మనుషులకు రోగాలను ఎలిగించే క్రిములున్నట్లే జబ్బులను కల్గించే క్రిములు కూడా ఉన్నాయి. వీటిలో బెవేరియా వంటి బూజు జాతికి చెందిన శిలీంద్రాలు కాండం తొలిచే పురుగు మీద, ఎన్‌పీవి. అనే వైరస్ రెల్లరాల్చు పురుగు మీద వ్యాధులు కలిగించడం వలన అవి చలవ రహితమై నశిస్తాయి. కాబట్టి వరిలో జీవావరణ వ్యవస్థలో ఎన్నో మిత్ర పురుగులు, శత్రు పరుగులను ప్రకృతి సిద్ధంగా నియంత్రిస్తున్నాయి. కాబట్టి రైతులు పైరు తొలి దశలలో పురుగు మందులు వాడకుండా మిత్ర పురుగుల వృద్ధి అయ్యేటట్లు చూడాలి. అందు కోసం రైతులందరూ పొలంబడి కార్యక్రమంలో పాల్గొనాలి.

కనీసం వారానికి ఒక్కసారైనా రైతులు స్వయంగా పొలాల్లో తిరిగి వివిధ దశల్లో పైరు పెరుగుదల, చీడ, పీడల ఉనికిని క్రిమి కీటకాదులను నిశితంగా పరిశీలించి, పొలం పరిసరాల విశ్లేషణ శత్రు, మిత్ర కీటకాల మదింపు చేసుకొని రైతులు ఆర్థిక వ్యయం నిర్ణయం తమ పంటపై తీసుకోవాలి.